

జీఎస్టీ తుస్..!

- టపాసుల విక్రయాల్లో ఇష్టారాజ్యం
- రూ.3.50 కోట్లు ఎగవేసిన ఇద్దరు వ్యాపారులు
- హోల్‌సేల్, రీటైలర్లూ వీరే..
- ఉమ్మడి జిల్లాలో 555 దుకాణాలు
- అధికారులకు భారీగా ముడుపులు

7



వెలుగుల పండుగ

నేడే దీపావళి

టపాసుల కొనుగోళ్లలో జనం బిజీ



శింగనమల వద్ద టపాసుల కొనుగోలుదారుల సందడి

అనంతపురం టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చీకట్లను పారదోలి, వెలుగులు నింపే పండుగ దీపావళి. అలాంటి ప్రత్యేక పర్వదినాన్ని సోమవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా చేసుకోనున్నారు. అన్ని వయసుల వారికి దీపావళి అసలైన సంబరం. ఇంటి లోపల, బయట దీపాలు వెలిగించి, ఆ వెలుగుల్లో పండుగ చేసుకుంటారు. ఇంటిల్లిపాదీ టపాసులు పేల్చుతూ ఆనందంగా గడుపుతారు. ఈ నేపథ్యంలో టపాసుల కొనుగోళ్లతో దుకాణాలు కిటకిటలాడాయి. ఆదివారం నరక చతుర్దశిని పురస్కరించుకుని ప్రజలు ఇళ్లలో గృహాల్లో దీపాలు వెలిగించి, చీకటిని పారద్రోలి వెలుగులను స్వాగతించారు. పండుగ రోజున మహాలక్ష్మీదేవి భూలోక విహారానికి వస్తారనీ, ఆ సమయంలో అమ్మవారిని కొలిస్తే సకల సౌఖ్యాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే దీపావళి రోజున గృహాలు, వ్యాపార సముదాయాలన్నీ లక్ష్మీపూజతో కళకళలాడుతుంటాయి. సోమవారం జరుపుకోనున్న పండుగ నేపథ్యంలో పూజా సామాగ్రి, దీపపు ప్రమిదలతో పాటు చిన్నారులకు ఇష్టమైన బాణసంచా కొనుగోళ్లతో ఆదివారం జిల్లా కేంద్రంతోపాటు ప్రధాన పట్టణాలన్నీ ప్రజలతో కిటకిటలాడాయి. శింగనమల సమీపంలో ఇంద్రప్రస్థ టపాసుల కేంద్రం, జిల్లా కేంద్రంలో దుకాణాల వద్ద సందడి నెలకొంది.



అనంతపురంలోని శ్రీనగర్ కాలనీ సమీపంలో టపాసుల కేంద్రాల వద్ద కిక్కిరిసిన జనం



నేడు పీజీఆర్ఎస్ రద్దు

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం నిర్వహించడం లేదని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకో

వైసీపీలో మైక్ రచ్చ

● భగ్గుమన్న వర్గ రాజకీయాలు ● రసాభాసగా సంతకాల సేకరణ

రాయదుర్గం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీలో రెండు వర్గాల మధ్య ఉన్న విభేదాలు భగ్గుమన్నాయి. సంతకాల సేకరణ కార్యక్రమం రసాభాసగా మారింది. పట్టణంలోని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి నివాసం వద్ద ఆదివారం కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డి సమక్షంలోనే రాష్ట్ర కౌన్సిలింగ్ కార్యవర్గ సభ్యుడు గౌని ఉపేంద్రరెడ్డికి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వలేదు. దీంతో మాజీ ఎంపీపీ నాగరాజురెడ్డితో పాటు అయన తమ్ముడు శ్రీరామిరెడ్డి, వారి అనుచరులు ఒక్కసారిగా రెచ్చిపోయారు. ఉపేంద్రరెడ్డి వైసీపీకి అవసరం లేదా అంటూ నిలదీశారు. మండల స్థాయి నాయకులకు మాట్లాడే అవకాశం కల్పించి నియోజకవర్గ స్థాయి నాయకుడు అయిన ఉపేంద్రరెడ్డికి మాట్లాడే అవకాశం ఉద్దేశపూర్వకంగానే ఇవ్వలేదని నిలదీశారు. తమను కావాలని అణచివేస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అరగంట పాటు సమావేశం రసాభాసగా మారింది. రెండు వర్గాలుగా విడిపోయి వాగ్వాదం చేసుకున్నారు. మరికొందరు నాయకులు సర్దిచేప్పేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి జోక్యం చేసుకుని సర్ది చెప్పారు.



సర్దిచెబుతున్న నాయకులు



అగ్రహంతో ప్రశ్నిస్తున్న మాజీ ఎంపీపీ

ఉద్యోగుల కళ్లలో కాంతులు: ఏపీఎన్జీఓలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. ఉద్యోగుల కళ్లలో కాంతులు నింపారని ఏపీఎన్జీఓల సంఘం నేతలు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం.. డీఏ, హెల్త్ కార్డుల వ్యవస్థ పునరుద్ధరణ, చైల్డ్‌కేర్ లీవ్‌లు తదితరాలను ప్రకటించడం పట్ల ఏపీఎన్జీఓ నేతలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ నిర్ణయాలతో ఉద్యోగులకు ఒకరోజు ముందుగానే దీపావళి పండుగ వచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, సంఘాల నేతలు సిరాజుద్దీన్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి పోలీసు అమరవీరుల

వారోత్సవాలు

31వతేదీ వరకూ కార్యక్రమాలు: ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఎస్పీ జగదీష్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ వారోత్సవాలు జరుగుతాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్టేషన్లలో వారోత్సవాలు నిర్వహించాలన్నారు. ఈనెల 21న డీపీఓలోని అమలవీరుల స్థూపం వద్ద అమరవీరుల సంస్మరణ దినం, స్మృతి పరేడ్, 22వ తేదీ నుంచి 30వతేదీ వరకూ పోలీసు అమరుల గ్రామాలు, పట్టణాలు సందర్శన ఉంటుందన్నారు. 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ స్కూళ్లు, కళాశాలల్లో చర్చా వేదికలు, వక్తృత్వపు పోటీలు ఉంటాయని వివరించారు. 26, 27 తేదీల్లో జిల్లాలోని సినిమా హాళ్లు, స్థానిక కేబుల్ టీవీల్లో పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌తోపాటు, సబ్ డివిజన్ కార్యాలయాలు, పోలీస్టేషన్లలో ఓపెన్ హౌస్‌లు ఉంటాయన్నారు. 28న స్టేషన్లలో వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు, ఇతర సామాజిక సేవాకార్యక్రమాలు, 29న పోలీసుల త్యాగాలు, సెమినార్లు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని వివరించారు. 30న పోలీసు అమరవీరుల కుటుంబికుల సన్మానం, 31వ తేదీ జిల్లావ్యాప్తంగా సమైక్యా దినంలో భాగంగా ఉదయం యూనిట్ రన్, సాయంత్రం క్యాండిల్ ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వైసీపీ నేతలను కాలర్ పట్టి నిలదీయండి

- రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



లబ్ధిదారులతో ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురంక్రైం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నోరు ఉంది కదా అని ఇష్టమొచ్చినట్టు అసత్యప్రచారాలు చేసే వైసీపీ నాయకులను కాలర్ పట్టుకుని నిలదీయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. నియోజకవర్గ పరిధిలోని 64 మంది లబ్ధిదారులకు రూ.31 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో ఇప్పటి వరకూ 870 మంది సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా....595 మంది లబ్ధిదారులకు ఊరట లభించిందని, 16 విడతల్లో రూ. 5.50 కోట్లు మంజూరయిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం కోటి రూపాయలు కూడా మంజూరు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. సీఎం చంద్రబాబు డబ్బు గురించి ఆలోచించకుండా ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి, వైసీపీ నేతలు ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే.. టీడీపీ నాయకులు వాళ్లకు దీటుగా సమాధానం ఇవ్వాలని అన్నారు. నోరుంది కదా అని ఏది మాట్లాడినా చెల్లుతుందనుకుంటే.. తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రకాష్‌రెడ్డి సోదరులు ఐదేళ్లు దోపిడీ చేసిన డబ్బుతో హైదారాబాద్, బెంగళూరులో ఆస్తులు పోగేసి, ఇప్పుడు బీద అరుపులు అరుస్తున్నారంటూ ఆమె మండి పడ్డారు.

బస్టాండులో రూ.4 లక్షలు చోరీ

తాడిపత్రి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు దిగి బయటకు వస్తున్న సమయంలో మహిళ బ్యాగు నుంచి రూ.4 లక్షలు గుర్తుతెలియని దుండగులు అపహరించిన సంఘటన స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురానికి చెందిన విజయలక్ష్మి బుక్కరాయసముద్రం మండలంలో వైద్యఆరోగ్య శాఖలో పనిచేస్తున్నారు. ఆమె తాడిపత్రిలో ఉన్న నాగరత్నమ్మతో రూ.4లక్షలు అప్పు తీసుకున్నారు. ఆ అప్పును చెల్లించడానికి డబ్బులు తీసుకొని బస్సు దిగి చేనేత కాలనీలో నివాసం ఉంటున్న నాగరత్నమ్మ ఇంటివద్దకు వెళ్లాలని బయటకు వెళుతున్న సమయంలో.. గుర్తుతెలియని మహిళ, పురుషుడు విజయలక్ష్మి భుజా న వేసుకున్న బ్యాగును బ్లేడ్‌తో కోసి తీసుకుని పరారయ్యారు. ఈ క్రమంలో ఆమె చేతికి కూడా గాయాలయ్యాయి. గట్టిగా కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. బాధితురాలు వెంటనే పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చే శారు. రంగంలోకి దిగిన పోలీసులు బస్టాండ్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు.

జీఎస్టీ తుస్..!

టపాసుల విక్రయాల్లో ఇష్టారాజ్యం
రూ.3.50 కోట్లు ఎగవేసిన ఇద్దరు వ్యాపారులు
హోల్‌సేల్, రీటైలర్లూ వీరే..
ఉమ్మడి జిల్లాలో 555 దుకాణాలు
అధికారులకు భారీగా ముడుపులు



అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టపాసుల విక్రయాల ముసుగులో మరోసారి దోపిడీకి రంగం సిద్ధమైంది. ఇద్దరు కీలక వ్యాపారుల నుంచి రూ.కోట్లలో చిన్న వ్యాపారులకు విక్రయాలు జరిగాయి. ఈ క్రమంలో వ్యాపారుల నుంచి అధికారుల వరకు ఎవరి స్థాయిలో వారు వసూళ్లకు తెరలేపారు. వందల సంఖ్యలో తాత్కాలిక టపాసు దుకాణాలు ఏర్పాటు చేశారు. అనధికారికంగా మరికొన్ని దుకాణాలు వెలిశాయి. పెద్ద మొత్తంలో జీఎస్టీ ఎగవేస్తున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. కొందరికి గిఫ్ట్ బాక్స్‌లు కూడా పెద్ద మొత్తంలో వెళ్లాయి. జిల్లా కేంద్రమైన అనంతపురంలో అసోసియేషన్ ముసుగులో ఓ చోటా నాయకుడు వసూళ్ల పర్వం మొదలు పెట్టాడు.

రూ.3.50 కోట్లు ఎగవేత

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు కీలక వ్యాపారులు ఉన్నారు. ఈ ఇద్దరూ టపాసుల వ్యాపారంలో ఆరితేరారు. ఇద్దరికీ మ్యాగజైన్‌లు ఉన్నాయి. టపాసుల శాశ్వతకాలం విక్రయాలు జరిపే హక్కు ఉన్న వారికి మ్యాగజైన్ ఉంటుంది. పెద్ద గోడౌన్‌లో ఉంచి వాటిని విక్రయిస్తుంటారు. గుంతకల్లులో ట్రేడర్స్ పేరుతో ఒకరు, శింగనమల మండలంలో మరొకరు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక శాతం వ్యాపారులకు వీరిద్దరి నుంచే టపాసులు వెళ్తాయి. ఒక్కొక్కరు రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు టపాసులు కొనుగోలు చేశారని తెలిసింది. అనంతపురం డివిజన్ పరిధిలో అత్యధికంగా 230 వరకు దుకాణాలు ఏర్పాటు చేశారు. కళ్యాణదుర్గం డివిజన్‌లో 60, గుంతకల్లు డివిజన్‌లో 50, కదిరిలో 70, హిందూపురంలో 90, ధర్మవరం డివిజన్‌లో 55 దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 555 వరకు ఏర్పాటు చేశారు. వీరిలో కనీసం 400 దుకాణాల వరకు వీరిద్దరి నుంచే కొనుగోలు చేసి ఉంటారని అంచనా. రూ.3లక్షల నుంచి రూ.10లక్షల వరకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. నగటున రూ.5లక్షల చొప్పున 400 దుకాణాలకు లెక్కేస్తే రూ.20కోట్ల వరకు దీపావళి సందర్భంగానే విక్రయాలు జరిపి ఉంటారు. టపాసులకు 18 శాతం జీఎస్టీ చెల్లించాలి. అంటే రూ.3.60 కోట్లు చెల్లించాలి. కానీ పన్నుల శాఖకు చాలా తక్కువ స్థాయిలో పన్ను చెల్లిస్తారనే ఆరోపణలు వీరిపై ఉన్నాయి.

రీటైల్ వ్యాపారం కూడా..

మ్యాగజైన్‌లు స్థాయిలో వ్యాపారాలు నిర్వహించే వీరు హోల్‌సేలూ, రీటైలర్ అవతారం కూడా ఎత్తుతారు. ఓ ట్రేడర్స్ నేరుగా తాత్కాలిక వ్యాపారులతో విక్రయించడంతోపాటు దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేస్తారు. ఇక ఏడాది పొడవునా పెళ్లిళ్లు, ఇతర వేడుకలకు రీటైల్‌గా విక్రయిస్తారు. మరో కీలక వ్యాపారి నగర పరిధిలో ప్రత్యేకంగా కౌంటరు ఓపెన్ చేస్తారు. ఇక్కడే రీటైల్‌గా రూ.50లక్షల వరకు విక్రయిస్తారని సమాచారం. ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రూ.కోట్లలో ఎగవేస్తుంటే పన్నుల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలున్నాయి. వారికి ముడుపులు ముట్టాయనే ఆరోపణలున్నాయి.

టమోటా కిలో రూ.20

అనంతపురంరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. సరాసరి రూ.14, కనిష్ఠ రూ.10 ధర పలికిందన్నారు. మొత్తం ఆదివారం మార్కెట్‌కు 2,100 వచ్చాయన్నారు.

మారుతి బ్రాండ్ కార్లను ప్రోత్సహించాలి

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
'అనంత' అభిమానాన్ని మరువలేను: సినీనటి మీనాక్షి చౌదరి
నగరంలో సందడి



మాట్లాడుతున్న మీనాక్షి చౌదరి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



ఆటోమొబైల్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మీనాక్షిచౌదరి

అనంతపురం టౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మారుతి సుజుకి బ్రాండ్ కార్లను అనంత వాసులు మరింతగా ప్రోత్సహించాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అనంతపురం నగర శివారులోని శిల్పారామం వద్ద ఆదివారం నివ్య ఆటో మొబైల్స్ షోరూమ్ ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీతోపాటు సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్‌చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ.. భారతీయ బ్రాండ్‌కు సంబంధించిన మారుతి సుజుకి నూతన షోరూమ్‌ను అనంతపురం నగరంలో ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. వ్యాపార రంగంలోనూ నగరం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. అనంతరం సినీ నటి మీనాక్షి చౌదరి మాట్లాడుతూ... మారుతి సుజుకి మంచి ప్రీమియం బ్రాండ్ అని, తమ కుటుంబం కూడా మొదటి నుంచి మారుతి కార్లనే వినియోగిస్తోందని తెలిపారు. అనంతపురానికి తాను రావడం మొదటిసారి అని, ఇక్కడ సినీ ప్రేమికులు ఎక్కువగా ఉన్నారన్నారని అన్నారు. ఇంతటి సినీ ప్రేమికుల మధ్య నివ్య ఆటో మొబైల్స్‌ను ప్రారంభించే అవకాశం తనకు దక్కడం గర్వంగా ఉందన్నారు. నివ్య ఆటో మొబైల్స్ యజమాని మల్లు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... తాను అనంతపురం జిల్లా అల్లుడినేనని, గతంలోనూ ఇక్కడ ఆటో మొబైల్ బిజినెస్ చేశానని.. ఇపుడు నూతనంగా నివ్య ఆటోమొబైల్ షోరూమ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. సేల్స్, సర్వీస్, స్పేర్‌పార్ట్స్ అన్నీ ఒకేచోట లభిస్తాయని పేర్కొన్నారు. జిల్లా వాసులకు ఉత్తమ సర్వీస్ అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మారుతి సుజుకి బ్రాండ్‌కు చెందిన మిడ్ ఎస్‌యూవీ విక్టోరిస్ కారును ఆవిష్కరించారు. అలాగే జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తదనంతరం షోరూమ్ వెలుపల సినిమా పాటలకు నృత్యం చేస్తూ నటి మీనాక్షి చౌదరి అభిమానులను ఉర్రూతలూగించారు. ఆమె రాకతో నగరంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో మల్లు నివేదితారెడ్డి, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

మతి భ్రమించిందా.. శ్రీధర్ రెడ్డీ..!

పల్లె ఆగ్రహం



పుట్టపర్తిరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర పురోభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అవాకులు.. చెవాకులు.. పేలుతున్నావు.. మతిభ్రమించిందా..?' అంటూ మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిపై మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మండిపడ్డారు. 'మానసిక సమస్య ఉంటే చెప్పు.. వైద్యం చేయిస్తా..' అంటూ ఎద్దేవా చేశారు. అనంతపురంలోని తన నివాసంలో పల్లె ఆదివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన జగన్‌మోహన్‌రెడ్డిని వదిలి, అభివృద్ధి కోసం కష్టపడుతున్న చంద్రబాబునాయుడుపై విమర్శలు చేయడం ఏంటని మండిపడ్డారు. ప్రశాంతంగా వ్యాపారాలు చూసుకోవాలనీ, వైసీపీ వచ్చేదీలేదు, చచ్చేదీలేదని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పుట్టపర్తి నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి చేశామో వైసీపీ కార్యకర్తలనే అడిగి తెలుసుకోవాలన్నారు. పుట్టపర్తిలో అసాంఘిక కార్యకలాపాలను సహించేదిలేదనీ, ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. 'నీ అవినీతి గురించి చెప్పమంటావా.. సాయిటవర్ నుంచి అంగన్‌వాడీ వర్కర్ పోస్టుల అమ్మకాల వరకు నీ అక్రమాల చిట్టా విప్పాలా' అంటూ ధ్వజమెత్తారు. నోటి దురుసు తగ్గించుకుంటే మంచిదని హితవు పలికారు.

ఆరిపోయిన దీపాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి..
మరొకరికి తీవ్రగాయాలు
పండగ పూట ఆయా కుటుంబాల్లో విషాదం



అరుణ్‌కుమార్ (ఫైల్)



లక్ష్మణసాయి (ఫైల్)

నల్లమాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వేళ ఆ కుటుంబాల దీపాలు ఆరిపోయాయి. చేతికొచ్చిన కొడుకులు విగత జీవులయ్యారు. రాత్రంతా మిత్రులు సాసవుల చిన్నమ్మ కథ విని ద్విచక్ర వాహనంలో వెళుతూ ప్రమాదంలో మృతి చెందారు. వారి తల్లిదండ్రులకు తీరని విషాదం మిగిలింది. బిడ్డలను చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మాకు దిక్కెవరంటూ గుండెలు బాదుకున్నారు. నల్లమాడ మండలంలోని గోపేపల్లి వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా.. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీ కొన్న ప్రమాదంలో నల్లమాడ గ్రామానికి చెందిన లక్ష్మణసాయి(19), అరుణ్‌కుమార్ (19) అక్కడికక్కడే మృతి చెందగా.. చారుపల్లి బన్నీ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు.. శనివారం రాత్రి నల్లమాడలోని షిర్డిసాయిబాబా ఆలయం వద్ద సాసవుల చిన్నమ్మకథ ప్రదర్శించారు. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల వరకు చిన్నమ్మ కథను తిలకించారు. ముగ్గురు మిత్రుల్లో చారుపల్లి బన్నీ బెంగళూరు వెళ్లాలని చెప్పడంతో.. ఒకే ద్విచక్రవాహనంలో కదిరికి వెళ్లారు. పండుగ పూట ఎందుకు, తర్వాత వెళ్లొచ్చని మిత్రులు చెప్పడంతో బన్నీ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నాడు. ఉదయం 6 గంటల సమయంలో ముగ్గురూ కదిరి వైపు నుంచి ద్విచక్రవాహనంలో నల్లమాడకు బయలుదేరారు. మార్గమధ్యంలో గోపేపల్లి సమీపాన రోడ్డు మలుపులో ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొని రాళ్లపై పడడంతో లక్ష్మణసాయి, అరుణ్‌కుమార్ తలలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. చారుపల్లి బన్నీ తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. లక్ష్మణసాయి, అరుణ్‌కుమార్, చారుపల్లి బన్నీ చిన్ననాటి నుంచి మంచి స్నేహితులు. వీరంద రి కుటుంబాలు నల్లమాడలోని గంగా థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్నాయి. లక్ష్మణసాయి తండ్రి వెంకటనారాయణ బేల్దారి పనులు చేసుకుంటుండగా, అరుణ్‌కుమార్ తల్లి కుళ్లాయమ్మ కూరగాయల వ్యాపారం చేసుకుంటోంది. అరుణ్‌కుమార్, లక్ష్మణసాయి, బన్నీలు పదో తరగతి వరకు చదువుకున్నారు. బన్నీ ఇటీవల బెంగళూరుకు వెళ్లి ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో పనిచేసుకుంటున్నాడు. లక్ష్మణసాయి, అరుణ్‌కుమార్ ఇళ్ల వద్దే చిన్న చిన్న పనులు చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉన్నారు. బన్నీ మూడు రోజుల క్రితం నల్లమాడకు వచ్చాడు. ఆదివారం బెంగళూరుకు వెళ్లాల్సి ఉంది.. కదిరిలో బస్సు ఎక్కిస్తామని ముగ్గురు కలిసి ఒకే ద్విచక్రవాహనంలో వెళ్లి, ప్రయాణాన్ని రద్దు చేసుకుని తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ నరేంద్రరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను పంచనామా కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం లక్ష్మణసాయి మృతదేహాన్ని నల్లమాడకు, అరుణ్‌కుమార్ మృతదేహాన్ని నల్లసింగయ్యగారిపల్లికి తరలించి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వీరు మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో పండుగ పూట తీవ్ర విషాదం నెలకొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఢిల్లీ, ఆంధ్రా మ్యాచ్ డ్రా

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ, ఆంధ్రా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. నాలుగు రోజులుగా స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న బీసీసీఐ సీకే నాయుడు అండర్-23 క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌ను ఆంధ్ర జట్టు 181.5 ఓవర్లలో 6 వికెట్లకు 630 పరుగుల వద్ద చేసి డిక్లేర్ చేసింది. ఎస్వీ రాహుల్ (386 బంతుల్లో 18బౌండరీలు, రెండు సిక్సర్లతో 203) డబుల్ సెంచరీ, అభినవ్ (101) సెంచరీతో కదంతొక్కారు. ప్రసాద్ (94), తేజ (76), సాయిశ్రావణ్ (73) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. మొదటి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ జట్టు 126 ఓవర్లలో 394 పరుగులకు ఆలౌటైంది. బ్యాటర్లు దేవ్‌లాక్రా సెంచరీ (158), క్రిష్‌దేవ్ హాఫ్ సెంచరీ (70)తో ఫర్వాలేదనిపించారు. ఆంధ్రా బౌలర్లు ఆదిత్యరెడ్డి, సాయిశ్రావణ్ చెరో 3, సుమిత్ 2 వికెట్లు పడగొట్టారు.

మహోన్నతుడు వాల్మీకి మహర్షి: ఎంపీ



వాల్మీకి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ అంబికా

గార్లదిన్నె, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రామాయణ గ్రంథాన్ని రచించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి మహర్షి అని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సర్పంచు రామాంజి, సూర్యనారాయణ, నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా పరిటాల కుటుంబం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీత

ఆత్మకూరు అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వివిధ కారణాలతో మరణించిన టీడీపీ నాయకులు, కార్యకర్తల కుటుంబాలకు పరిటాల కుటుంబం అండగా ఉంటుందని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. మండలంలోని వై కొత్తపల్లి గ్రామంలో టీడీపీ ఎస్టీ సెల్ నాయకుడు గుజ్జుల వెంకటేసులు శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వారు స్వగ్రామంలో ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పంపనూరు మాజీ సర్పంచ్ పద్మావతి భర్త రామచంద్ర అనారోగ్యంతో మరణించాడు. ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.20 వేలు ఆర్థిక సాయం అందించి అధైర్య పడవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నారాయణస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

దూదేకుల సమస్యలను పరిష్కరించండి



సీఎం చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఉమర్ ముక్తార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దూదేకుల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబును ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఉమర్ ముక్తార్ కోరారు. ఆదివారం సచివాలయంలో సీఎంను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. దూదేకుల అభివృద్ధికి ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చినట్లు ఉమర్ తెలిపారు.

బీజేపీలో చేరిన యువత

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): బీజేపీలోకి యువత భారీగా చేరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నవోదయ కాలనీకి చెందిన నాయకురాలు మనీషా ఆధ్వర్యంలో యువతకు రాష్ట్ర కార్యదర్శి నందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎస్సీ మోర్చా నాయకులు మిట్టా రాజా, మేఘనాథ్, రవి పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

రామగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వికలత్వం శాతం పెంచుతామని ఫోన్ల ద్వారా మోసం చేసిన వ్యక్తిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజుల క్రితం వికలత్వశాతం పెంచుతామని శివ అనే వ్యక్తి కలెక్టరేట్ ఏఎస్‌ఏ పీటీపీ అని ట్రూకాలర్‌లో వచ్చేలా చేసుకుని మండలంలోని పలువురు దివ్యాంగులకు ఫోన్లు చేసి వికలత్వ శాతం పెంచుతామని అకౌంట్‌లో డబ్బులు వేయాలని నమ్మబలిగాడు. రామగిరికి చెందిన శ్రీనివాసులు కుమార్తె రూ.24వేలు ఫోన్‌పే ద్వారా డబ్బులు వేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

'వైసీపీ పాలనలో ఉపాధి నిధులు దోచుకుతిన్నారు'

ఆత్మకూరు అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఉపాధి నిధులు దోచుకుతన్నారని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ హేమలత, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ బాలపోతన్న కూలీల జాబ్‌కార్డులను అడ్డం పెట్టుకుని రూ.లక్షలు దోచేశాన్నారు.

డీఏ ప్రకటన హర్షణీయం



తిమ్మప్ప

అనంతపురంరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు డీఏ ప్రకటించి దీపావళి పండుగ శుభవార్తనిచ్చిందని ఆల్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తిమ్మప్ప అన్నారు. ఆ సంఘం అధ్యక్షకార్యదర్శులు తిమ్మప్ప, సుబ్రహ్మణ్యం, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నాగమునీంద్ర, ప్రధాన కార్యదర్శి మారుతి సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం డీఏ ప్రకటించడంతోపాటు నవంబరు నెల ఉద్యోగుల వేతనాల్లో జమచేస్తామని చెప్పడం ఆనందంగా ఉందన్నారు.

టీడీపీ నేత విజయశ్రీకి పరామర్శ

అనంతపురంక్రైం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు విజయశ్రీని జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి పరామర్శించారు. ఇటీవల ఆమె రోడ్డుప్రమాదంలో గాయపడ్డారు. ఆదివారం వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే తోపుదుర్తి కమితమ్మను ఆయన పరామర్శించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

రాప్తాడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. మండలంలోని 44 జాతీయ రహదారిపై వేగంగా వెళుతున్న కారు ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు అనంతపురం నుంచి బెంగళూరుకు లలితా, రాజ్ కుమార్ దంపతులు కుమారుడు శబరీష్‌తో కలిసి కారులో వెళుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం రాప్తాడు సమీపంలో కారు వేగంగా వెళుతూ అదుపుతప్పి ఆగి ఉన్న కంటెయినర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వారిని అనంతపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

సి. బండమీదపల్లిలో ఒకరు..


శింగనమల(ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.బండమీదపల్లి వద్ద ఇన్నోవా బైక్‌ను ఢీకొన ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు సి.బండమీదపల్లి గ్రామానికి చెందిన చాకలి వెంకటపుల్లయ్య ఆదివారం రాత్రి చక్రాయపేట గ్రామానికి కుల వృత్తిలో భాగంగా బట్టలు తీసుకుని గ్రామానికి వచ్చే సమయంలో చక్రాయపేట నుంచి సి.బండమీదపల్లి మలుపు వద్ద అనంతపురం నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న ఇన్నోవా ఢీకొనడంతో గాయపడ్డాడు. 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ టవర్ నిర్మాణ పనుల అడ్డగింత

గుంతకల్లుటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 12వ వార్డులోని వాటర్ ట్యాంక్ ఎదురుగా సెల్ టవర్ నిర్మాణ పనులను ఆ కాలనీ వాసులు ఆదివారం రాత్రి అడ్డుకున్నారు. కాలనీలో ఓ సెల్ కంపెనీకి చెందిన వ్యక్తులు సెల్ టవర్ నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఆ విషయం తెలుసుకున్న కాలనీవాసులు అడ్డుకున్నారు. ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్ మాట్లాడుతూ.. జనవాసాల మధ్య సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తే.. ఆ టవర్ వల్ల వచ్చే రేడియేషన్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుందని, ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని నిర్మాణాన్ని వెంటనే ఆపాలని అన్నారు. ఈ విషయంపై కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. సెల్ టవర్ నిర్మాణం చేస్తున్న నిర్వాహకులు సోమవారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు రావాలని పోలీసులు సూచించారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు.

డీఏపై ఉద్యోగుల హర్షం

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల డిమాండ్ల మేరకు సీఎం చంద్రబాబు దీపావళి కానుకగా నవంబరు నుంచి ఒక డీఏ విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంపై ఏపీ ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్ ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమంగా నడిపించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ప్రమోషన్లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని సీఎం ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇలా దీపావళి రోజున ప్రభుత్వ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎంకు ఏపీ ఎన్జీఓ సంఘం నాయకులు పలు ప్రకటనల్లో కృతజ్ఞతలు తెలిపారు.



ఆడవి గొల్లపల్లి వాసి మృతి

బొమ్మనహాళ్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శెట్టూరు మండలం ఆడవి గొల్లపల్లి గ్రామానికి చెందిన గొల్ల గోవింద (54) బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లు గ్రామంలో ఆదివారం మరణించాడు. అతను శుక్రవారం రాత్రి ఉంతకల్లులో పాండురంగస్వామి దర్శనం కోసం వచ్చిన అతను శనివారం కుడా ఉంతకల్లు గ్రామంలోని ఉన్నాడు. ఆదివారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని బహిర్భూమికి వెళ్లి.. అక్కడే మరణించాడు. ఉదయం గమనించిన స్థానికులు బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతని బంధువులకు సమాచారం అందించారు. బంధువులు గోవింద మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లారు.

పది మందిపై కేసు

యాడికి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో 10మందిపై పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఈనెల 4న ఓ గ్రామానికి చెందిన ఒక వివాహిత ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడంతో అతను పారిపోయాడు. బాధిత మహిళ ఈ విషయాన్ని భర్త, కుమారుడికి తెలిపింది. వారు ఆ వ్యక్తి ఇంటికి వెళ్లి.. మందలించారు. దీంతో ఆ వ్యక్తి సమీప బంధువులతో కలిసి ఈ నెల 8న వారి దాడి చేశారు. ఆ దాడిలో ఆ మహిళ భర్త, కుమారుడు గాయపడ్డారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పది మందిపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు.

పాము కాటుతో రైతుకు అస్వస్థత

గుత్తిరూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నేదొడ్డి గ్రామానికి చెందిన రైతు పాపిరెడ్డి కాటుతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆదివారం ఆయన తన పొలంలో పని చేస్తుండగా కాలికి పాము కాటు వేసింది. తోటి రైతులు వెంటనే అతన్ని స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

జూదరుల అరెస్టు

తాడిపత్రి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్‌కాలనీ సమీపంలో ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.18100 స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



ఎద్దు కళేబరం వద్ద రైతు

తాడిపత్రి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపల్లి గ్రామ సమీపంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌లను తక్కువ ఎత్తులో ఏర్పాటు చేశారు. ఆ గ్రామ రైతు బాలకృష్ణకు చెందిన ఎద్దు ఆదివారం అటుగా మేత మేయడానికి వెళ్లి వాటిని తగలడంతో అది అక్కడికక్కడే చనిపోయింది. తనకు దాదాపు రూ.70వేలు నష్టం వాటిల్లిందని బాలకృష్ణ వాపోయారు.

వైసీపీ కార్యకర్తపై దాడి

తాడిపత్రి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీబీరోడ్డులోని టీస్టాల్ వద్ద యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త నాగేశ్వరరెడ్డిపై ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారు. దీంతో అతను గాయపడ్డాడు. దాడి గురించి సమాచారం పూర్తిగా తెలియని, విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

రాయలచెరువులో చోరీ

యాడికి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో తాళం వేసిన ఇంటిలో దొంగలు పడి రూ.36 వేలు, 15 తులాల వెండి ఎత్తుకెళ్లారు. ఈ విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. రాయలచెరువుకు చెందిన అమిలినేని లక్ష్మీనారాయణ ఈనెల 16న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లారు. ఆదివారం సాయంత్రం ఇంటి తలుపులు తెరిచి ఉండడాన్ని లక్ష్మీనారాయణ బంధువులు గుమనించారు. ఫోన్ చేసి లక్ష్మీనారాయణకు విషయాన్ని తెలిపారు. ఇంటి లోనికి వెళ్లి చూడగా.. రూ.36వేలు నగదు, 15తులాల వెండి పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ వెంకటరమణయ్య ఆ ఇంటిని పరిశీలించారు. ఇంటి యజమాని వచ్చిన తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 1,102 క్యూసెక్కులు

బెళుగుప్ప, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 1,102 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 1,954 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. రిజర్వాయరులో నీటి నిల్వ 1.681 టీఎంసీలు ఉందని, ఫేజ్-2కు 1,894 క్యూసెక్కుల నీరు వెళ్తోందని వివరించారు.

రోడ్డు పనులు ప్రారంభం

విడపనకల్లు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీ కొత్తకోట రోడ్డు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విషయాన్ని ఆ గ్రామస్థులు మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణానికి పంచాయతీ రాజ్ నిధులు రూ. 1.30 కోటిని మంజూరు చేయించారు. ఆ పనులను అధికారులు, స్థానిక నాయకులు ఆదివారం ప్రారంభించారు.

ఘనంగా వాల్మీకి జయంతి

బెళుగుప్ప, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మండలంలోని గంగవరంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో శ్రీరామభజనలు చేస్తూ భక్తులు చిత్రపటాన్ని ఊరేగించారు.



వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గ్రామస్థులు

వడ్డెర్లకు మైనింగ్ లీజుల కేటాయింపుపై హర్షం

ఉరవకొండ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వడ్డెర్లకు మైనింగ్ లీజులు కేటాయింపు అంశంపై విధానాన్ని తయారు చేయాలని సీఎం సూచించడం పట్ల వడ్డెర్ల సంఘం నాయకులు హర్షంవ్యక్తం చేశారు. ఈ మేరకు స్థానిక రోడ్డు భవనాల వసతి గృహంలో ఆదివారం సీఎం, ఆర్థిక శాఖ మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వడ్డెర్ల సంఘం నాయకుడు సంజీవ రాయుడు మాట్లాడుతూ.. వెనుకబడిన వర్గాలకు చెందిన వడ్డెర్లు, సొసైటీలకు 15 శాతం గనుల్లో రిజర్వేషన్ కల్పించాలని, దీనిపై కేబినెట్‌లో చర్చించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు లాల్‌స్వామి, గంగరాజు, శివరుద్ర, ఈరన్న, శంకరయ్య, పాల్గొన్నారు.

సోలార్ ప్రాజెక్టుతో
రైతులకు ఆదాయం

- 2,600 ఎకరాలు ఇవ్వడానికి అన్నదాతల అంగీకారం
- శ్రీశక్తి సోలార్ అగ్రికల్చర్ ప్రాజెక్టు సీఎండీ అనిల్



రైతులతో సమావేశమైన సోలార్ కంపెనీ ప్రతినిధులు

కళ్యాణదుర్గం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సోలార్ ప్రాజెక్టుకు భూములు లీజుకు ఇచ్చిన రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని శ్రీశక్తి ఇంటిగ్రేటెడ్ సోలార్ అగ్రికల్చర్ ప్రాజెక్టు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చెరకు అనిల్ దయాకర్ తెలిపారు. ఆదివారం కంబదూరు మండలం రాంపురం గ్రామంలో సోలార్ ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ దయాకర్ మాట్లాడుతూ.. వెనుకబడిన ప్రాంతంలో అభివృద్ధి కోసం రైతులు 2,600 ఎకరాల భూములు లీజుకు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారన్నారు. లీజు రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఎకరాకు రూ.33 వేల ప్రకారం సంవత్సరానికి లీజు చెల్లిస్తామని తెలిపారు. సోలార్ ప్రాజెక్టుకు భూములు లీజుకు ఇచ్చిన వారి కుటుంబంలో ఒక రేషన్‌కార్డుకు ఒక ఉద్యోగం.. విద్యార్హతను బట్టి నెలకు రూ.20 వేల నుంచి రూ.50వేల వరకు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు వస్తే బ్యాంకు తరహాలో కంపెనీ రుణ సహాయం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ జయంత్ జెట్టి రామచంద్ర, రీజనల్ డైరెక్టర్ సూర్యం, తెలంగాణ డైరెక్టర్ బాబన్న పాల్గొన్నారు.

చిరుతదాడిలో ఆవుదూడల మృతి

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మ కాలనీ వాసి వెంకటేశులుకు చెందిన రెండు ఆవుదూడలపై శనివారం అర్ధరాత్రి ఓ చిరుత దాడి చేయగా.. అవి మరణించాయి. ఇంటి సమీపంలోని మామిడితోటలో రెండు దూడలు, మూడు ఎనుములను అతను కట్టేశాడు. శనివారం అర్ధరాత్రి రెండు ఆవుదూడలపై చిరుత దాడి చేసి చంపేసింది. దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. సంఘటన స్థలాన్ని అటవీశాఖ సిబ్బంది పరిశీలించారు.